# అభిజాత్యం



-శ్రీధరరావు దేశ్‌పాండే



మనిషి జీవిత చక్రంలో బాల్యం, కౌమారం అనే మొదటి రెండు దశల్ని గడిపేసి యవ్వనపు సగభాగాన్ని అనుభవించిన నేనుసర్కార్ను నౌకరీని సెక్రెటేరియట్‌లో వెలగబెడ్తూ భార్యా బిడ్డలతో హాయిగానే ఉన్నాను. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినప్పటికీ ఆ వాతావరణపు ఆధిక్యతా భావజాలం నుండీ, ఆ అభిజాత్యాల నుండీ నన్ను నేను విముక్తుడిని చేసుకున్నందుకు నాకు ఆనందంగానే ఉంది. ఉద్యోగంతో పాటు ఉద్యోగ సంఘాల కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండడం వలన నా పరిచయాలు పరిధి కాస్త విస్తృతమైంది. ఈ నేపథ్యంలో నా స్నేహితుల సంఖ్య పెరి గింది. నాస్నేహాలు, పరిచయాలు ఆధారంగా మా బంధువల మిత్రుల పిల్లలకి పెళ్ళి సంబందాలు కుదరడంలో సహాయ పడ్డాను. మా ఊర్లో కూడా పెళ్ళిళ్ళ పేరయ్యగా మంచి సంబంధాలు కుదురుస్తానని కాస్త పేరు సంపాయించు కున్నాను.

సెలవుల్లో మా ఊరు వెళ్ళినపుడు ఓ రోజు ప్రొద్దున్నే టీ తాగి పేపర్ చదువుతూ కూర్చున్నాను. "నాన్న! ఎవరో వచ్చారు నీ కోసం' అంటూబుజ్జిది కబురు తెచ్చింది. లేచి డ్రాయింగ్‌రూమ్‌లోకి వెళ్ళాను. శారదమ్మగారు కూర్చుని ఉన్నారు. నాకు చిన్నప్పట్నించీ బాగా తెల్సిన వ్యక్తే. నలబై అయిదేళ్ళ వయసు ఉంటుందేమో. భర్త చాలా ఏళ్ళ క్రితమే రోడ్డు ప్రమాదంలో పోయాడు. ఇద్దరు పిల్లలు ఒకమ్మాయి ఒకబ్బాయి, పిల్లల్నిద్దర్నీ ఎంతో కష్టపడి పెంచారు. చిన్న చితకా ఉద్యోగాలు చేసి ఆఖరికి ఓ ప్రభుత్వోద్యోగంలో స్థిరపడి బతుకుని ఓ గాడిలోకి తీసుకొచ్చారు. అబ్బాయి చదువు అబ్బక ఏదో వ్యాపారం మొదలెట్టాడు. అమ్మాయి డిగ్రీ చదువు పూర్తిచేసి ఓ ప్రైవేటు బడిలో టీచరుగా చేరింది. ఒంటరిగా ఆమెచేసిన జీవన పోరాటం ఎవరికైనా ఆశ్చర్యం

కల్గించకమానదు. ఆ కారణంగా ఆమెఅంటె సానుభూతితో పాటు గౌరవాన్ని కూడా ఏర్పర్చుకున్నాను. వాళ్ళు బ్రాహ్మలే కావడం మూలాన మా కుటుంబంతో సన్నిహిత పరిచయం కూడా ఉందామెకి.

నేను కనబడగానే కుర్చీలో కాస్త కదిలి ముందుకు వంగి "మీ కోసమే వచ్చాను" అన్నారు.

నాతో ఆవిడకి ఏంపని అనుకుంటూ "చెప్పండి" అన్నాను. ఎదురుగా కుర్చీలో కూర్చుని.

"మా రాధకి పెళ్ళి చెయ్యాలి. మీకు తెల్సిన వాళ్ళెవరైనా ఉంటె చెప్తారేమోనని వచ్చాను. మీకు పరిచయాలు ఎక్కువే కదా! తగిన సంబంధం ఏదైనా ఉంటె చూడండి" అన్నారు. నా పెళ్ళిళ్ళ పేరయ్య తనం ఈవిడకి కూడా తెల్సిందా అనుకుంటూ ఏం చెప్పాలో పాలుపోక ఆలోచిస్తు ఉండిపోయాను. మళ్ళీ ఆవిడే "కులం గురించి పట్టింపులు లేవు మాకు. మంచి వాళ్ళు అయి ఉండి అబ్బాయి ఏదైనా గవర్నమెంట్ జాబ్ చేస్తుంటే చాలు. ఆస్తిపాస్తులు ఉన్నా లేకున్నా పర్వాలేదు. పెద్దకుటుంబాల వాళ్ళయితే కట్నాలు పెద్దగానే అడుగుతారు.. మనం అంత ఇవ్వలేం కదా!" అన్నారు. ఆవిడ మాటలు వింటూనే ఉన్నాను. అపుడు నా దృష్టిలో నిజానికి ఏ సంబంధాలు లేవు. అందుకని నా దృష్టిలోకి వస్తే తెలియజేస్తానని ఆవిడ్ని పంపించేసాక ఆవిడ కులపట్టింపులని ఎలా వదిలేయగల్గిందా అని ఆలోచిస్తూ ఉండిపోయాను. అదే సమయంలో ఆమెని ఆ విషయంలో అభినందించకుండా ఉండలేకపోయాను. బహుశా జీవితంతో ఆమె చేసిన నిరంతర పోరాటం ఆమెకి ఈ సడలింపులకి ధైర్యాన్ని ఇచ్చాయను కున్నాను. ఆక్షణంలో, కాని నా ఆలోచన తప్పుని ఆరోజు రాత్రే తెల్సిపోయింది. రాత్రి భోజనాల సమయం మా ఇంట్లో చర్చలకి, కబుర్లకి అనువైన సమయం ందరూ వచ్చే వరకు మా అమ్మ భోజనం వడ్డించదు. ఆ సంప్రదాయం ఇంకా అలాగే కొనసాగు తోంది. మాటల సందర్భంగా అమ్మతో శారదమ్మ విషయం ప్రసాతవించాను. కుల పట్టింపుల ఆవిడ ఎందుకు వదిలేయాల్సివచ్చిందో అర్థం అయ్యింది. అందులో ఆమె విశాల హృదయం, అభ్యుదయ దృక్పథం కంటె జీవితం నేర్పిన లౌక్యమే ఎక్కువ అన్పించింది.

మా అమ్మ చెప్పిన శారదమ్మ జన్మ వృత్తాంతం విచిత్రమైంది, ఆసక్తికర మైందీనూ, మా ఊరు మారుమూల గ్రామమైనా మొదట్నుంచి తాలూకా కేంద్రం. ఓ నలభై ఏళ్ళ కిందటి మాట. గోదావరి పుష్కరాలకి మా ఊర్నించి చాలా మంది ధర్మపురి వెళ్ళారట. గోదావరి తీరంలో ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ ఏడుస్తు ఓ నాలుగేళ్ళ అమ్మాయి కన్పిస్తే ఒకావిడ జాలిపడి ఆ అమ్మాయి సంబందీకుల కోసం వెతికి వెతికి దొరక్కపోగా తనతో తెచ్చుకుందట. ఆ అమ్మాయే శారదమ్మగారు. ఈవిడ తల్లిదండ్రులెవరో, ఏకులంవారో తెలియదు. శారదమ్మగారు. ఈవిడ తల్లిదండ్రులెవరో, ఏకులం వారో తెలియదు. శారదమ్మగార్ని పెంచి పెద్దచెయ్యడమే కాదు తన తమ్ముడితో వివాహం కూడా జరిపించిందట. ఆ తర్వాత అన్ని విషయాల్లో జర్గినట్లుగానే ఆ విషయాన్ని మరచిపోయి చేసేదిలేక ఆమెని అంగీకరించి తనలో కలుపుకుంది మా ఊరి బ్రాహ్మణ సమాజం. భర్త చనిపోయాక బిడ్డల కోసం బతికారు శారదమ్మ. జీవితంలో ఎదురైన సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగిన శారదమ్మగార్కి ఇపుడు రాధ పెళ్ళి ఓ జటిల సమస్య అయ్యింది. తన బిడ్డని పెళ్ళి చేసుకోడానికి బ్రాహ్మణ కుటుంబాలేవి ముందుకు రావని ఆమెకు బాగానే అవగతమైంది. అందుకే ఈ కులపట్టింపుల సడలింపులు.

ఏమైతేనేం వాళ్ళమ్మాయి రాధకి సంబంధం వీలయితే చూద్దామని అనుకున్నాను. కులపట్టింపులు వదులుకుంటె సంబంధాలు కుదర్చడం కొంత సులభమేననినా స్వానుభవం. ఆ తర్వాత నిత్యజీవితకాల భ్రమణంలో ఈ విషయం మరుగున పడిపోయింది.

ఓరోజు మా కొలీగ్, ఆఫీసులో నాకు సన్నిహిత స్నేహితుడూ అయిన రాజారావుతో కల్సి వాళ్ళింటికి వెళ్ళాను. వాళ్ళింట్లో నేను ఓ కుటుంబ సభ్యుడిలా కల్సిపోయాను. రాజారావుకి ఓ తమ్ముడు న్నాడు అశోక్. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చేసి ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో సూపర్ వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. జీతం మూడు వేల పైచిలుకే. అబ్బాయి మంచి వాడు. నెమ్మదస్తుడు. భోజనాలు చేస్తుంటే రాజారావు వాళ్ళమ్మ అశోక్‌కి ఏదైనా మంచి సంబంధం ఉంటే చూడమని పురామాయించింది.

కులపట్టింపులు లేవంది. సంసారపక్షంగా ఉండి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న అమ్మాయి అయితే చాలునంది. కట్నకానుకల ప్రసక్తి కూడా లేదంది. వాళ్ళ తాహతుకి తగినట్లు పెళ్ళి చేస్తే చాలునంది. వాళ్ళది షెడ్యూల్డు కులం. పేదరికపు కష్టనష్టాల్ని, భయంకరమైన కులవివక్షల్ని అనుభవించి ఈనాడు ఆర్థికంగా బాగా ఎదిగి అన్ని ఆధునిక సౌకర్యాలతో మంచి ఇల్లు కట్టుకొని గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారు. వెంటనే మా ఊరి రాధ సంబంధం స్ఫురించింది. వీళ్ళకి తగిన సంబంధం అన్పించింది శారదమ్మగారి గత చరిత్రతోపాటు అన్ని విషయాలు చెప్పాను. పర్వాలేదు. పెళ్ళిచూపుల కార్యక్రమం ఏర్పాటు చెయ్యమంది రాజారావు వాళ్ళమ్మ. సరేనని చెప్పి ఆ రోజుకి వాళ్ళ దగ్గిర సెలవు పుచ్చుకున్నాను.

ఈ సంబంధం గురించి బాగా గుర్తుపెట్టుకొని దసరా సెలవులకి మా ఊరు వెళ్ళినపుడు శారదమ్మగారితో చర్చించాలనుకొన్నాను. అలాగే సెలవులకి ఊరికి వెళ్ళినపుడు ఆవిడ్ని కబురు చేసి విషయం చెప్పాను. నేను కుదిరించే సంబంధం మీద ఆమెకి గురి ఉండడం వల్ల అట్టే ప్రశ్నలు వెయ్యకుండా సరేనన్నారు. కులపట్టింపులు లేవన్నారు కనుక వాళ్ళ కులం గురించి ఏం ప్రస్తావనా చెయ్యలేదు. పెళ్ళి చూపుల కార్యక్రమం ఏర్పాటుచేసే ముందు వాళ్ళబ్బాయిని హైదరాబాదు పంపించి అక్కడి పరిస్థితుల్ని చూసి రమ్మన్నాను. సంతృప్తికరంగా తోస్తే పెళ్ళి చూపులు ఏర్పాటు చెయ్యొచ్చు నన్నాను. శారదమ్మగారు సరేనని ఆ రోజు రాత్రే వాళ్ళబ్బాయిని హైదరాబాదు పంపించారు.

రెండ్రోజుల తర్వాత వాళ్ళబ్బాయిచే ఇంటికి రమ్మని కబురు చేశారు

శారదమ్మగారు. బహుశా ఆ సంబంధం పట్ల సంతృప్తి చెందారనే ఊహిస్తూ సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాను.

వాళ్ళు చేసిన మర్యాదలు, వాళ్ళ మొహాల్లో వికసించిన సంతోషాల్ని చూసి ఈ సంబంధం ఖాయం చేసుకుంటారనే అన్పించింది. శారదమ్మగారే అసలు విషయాన్ని మొదట ప్రస్తావించారు.

"మావాడు హైదరాబాదు వెళ్ళి వాళ్ళని కల్సి వచ్చాడు. అంతా బాగానే ఉందన్నాడు. అబ్బాయి ఫోటో కూడా పంపించారు. రాధకి నచ్చాడు. అన్ని విషయాలు మీ చేత కబురుచెయ్యమన్నారట. వాళ్ళ గురించి అన్నీ చెప్పారు కాని వాళ్ళదేకులమో చెప్పలేదు" అంటూ ఆగిపోయారు శారదమ్మ.

ఆశ్చర్యపోవడం నా వంతయింది. కాస్త తేరుకుని

"అదేంటండీ! కులపట్టింపులు లేవన్నారుగా?! అందుకని చెప్పలేదు. మనకు పట్టింపులు లేనపుడు వాళ్ళదేకులం అయితే ఏమిటండీ?!" అన్నాను నెమ్మదిగానే.

"నిజమేననుకోండి, అయినా తెల్సుకుంటే ఏ తప్పులేదుకదా?" అన్నదావిడ. ఆమె ఉద్దేశ్యం అర్థంకాలేదు నాకు. అయినా కులం అనేది ప్రతీ భారతీయుడి జీవితంలో ఓ అవిభాజ్యమైన అంశం. కులం తెల్సుకోవడం కులవివక్షని పాటించడం రెండూ వేరు వేరు విషయాలని సమాధానపడి "ఎస్. సి.లండీ" అన్నాను.


ఆ తర్వాత కొన్ని నిమిషాలు రాజ్యమేలిన మౌనం నన్ను వివశుణ్ణి చేసింది. తెల్లబోయిన ఆవిడ మొహం నాకు చూయించలేక తల దించుకునే ఉంది.

ఆవిడ మౌనాన్ని ఛేదించాలని "మరి పెళ్ళి చూపులు ఏర్పాటు చెయ్యమంటారా' ' అన్నాను.

ఆవిడ చటుక్కున తలెత్తి "ఎంత కులపట్టింపులు లేకపోయినా మరీ ఇంత నీచకులం వాళ్ళ తో మనకు పడదు" చెప్పుకుపోతున్నారావిడ ఆవేశంగా.

నా చెవులు ఆవిడ మాటల్ని వింటున్నా హృదయం మాత్రం ఆమెని తీవ్రంగా అసహ్యించుకుంటోంది. ఇన్నేళ్ళుగా ఆమెపట్ల పెంచుకున్న గౌరవం, సానుభూతి ఒక్కసారిగా పేకమేడల్లాకూలిపోయాయి. స్వతహగా తనకు కులం లేకపోయినా నాలుగు దశాబ్దాల బ్రాహ్మణీకం ఆమెలో ఆధిక్యతా భావజాలాన్ని, ఆ వాతావరణపు అభిజాత్యాల్ని ఆమెలో ప్రవేశపెట్టాయి. పరిస్థితులకి తల వంచి కులపట్టింపులని సడలించుకున్నా అగ్రకుల పక్షపాతం, నిమ్నకుల వివక్ష ఆమెలో ఇంకా ప్రగాఢంగానే తిష్ఠవేసుకుని ఉన్నాయి. ఈ అభిజాత్యం ఆమెలోనేకాదు ప్రజాస్వామ్య వాదులం, నవనాగరీకులం, కాస్మోపాలిటన్ అని తమని తాము అభివర్ణించుకునే అనేకమందిలోనూ నేను చూసాను. పేపర్లలో వివాహ ప్రకటనల్లో "కులపట్టింపులు లేవు" అంటూనే "ఎస్. సి. ఎస్. టి. లు మినహా" అని రాసే వాళ్ళని చూసి అసహ్యించుకున్న నాకు ప్రత్యక్షంగా అనుభవంలోకి రావడం ఇదే ప్రథమం.

ఇక ఆమెతో సంభాషించడం నావల్ల కాక లేచి నుంచుని "మంచిదండి! మీ కిష్టంలేకపోతే పోనివ్వండి. మీ అమ్మాయికి మరేదైనా అగ్రకుల సంబంధం వెతుక్కోండి" అని చెప్పి తీవ్రమైన అసహనంతో బయటపడుతోంటే "ఆగండి అంకుల్"! అన్న పిలుపు విన్పించింది.




అనంకల్పితంగా నా అడుగులు ఆగిపోయాయి. వెనక్కి తిరిగిచూసాను. రాధ! ఆమె మొహంలో ఉదిగ్నత స్పష్టంగా కన్పిస్తోంది. ఆమె తిరగబడిన శ్రీ రామ చంద్రుడి చెల్లెలిలా తోచింది. వెనక్కి తిరిగిన నన్ను చూసి నా కళ్ళలోకి సూటిగా చూస్తూ" ఈ సంబంధం నాకిష్టమే అంకుల్. ఎవరికిష్టం ఉన్నా లేకున్నా నాకిష్టమే కనుక ఈ సంబంధం ఖాయం చెయ్యండి" అంది.

శారదమ్మ భయకంపితురాలై అలాగే చూస్తూ ఉండిపోయింది. ఇదంతా ఆవిడకి ఓ కలలాగా ఉండిందేమో. ఇంతలో రాధ శారదమ్మ వైపు చూస్తూ "అమ్మా! నువ్వు నిన్ను పెంచిన .తల్లి బ్రాహ్మణీకాన్నే వారసత్వంగా స్వీకరించావు. కాని ఆమె విశాల హృదయాన్ని వారసత్వంగా స్వీకరించలేకపోయావు. అది నీ తప్పో కాదో నాకు తెలియదు. మనుషులు గొప్ప వాళ్ళయ్యేది, నీచులయ్యేదీ వాళ్ళ వాళ్ల సంస్కారాల్ని బట్టికాని కులాల్ని బట్టికాదు. ఆ రకంగా చూస్తే నీదే నీచకులం నువ్వు ఆశీర్వదించినా లేకున్నా ఈ సంబంధం ఖాయమైతే పెళ్ళి జర్గితీరుతుంది" అంది ఖచ్చితంగా.